ఆంధ్రరాష్ట్రాని కంటే Secretary of State-Parliament-అంగీకారం కావాలి.

మన పసిపిల్లలికి తెనుగుతనం అబ్బడానికి, చెన్నపట్నంలో చిన్నపిల్లలికి తెనుగు అక్షరాలూ, చదువూ, నేర్పడానికీ, Parliamentary Legislation కావాలా?

అక్కర్లేదే!

అక్కర్లేకపోతే మన తెనుగునాయకులికి ఈవిషయంలో ఉపేక్ష ఎందుచేత?

ఉలికొన దూరిం దంటే మాను ముక్కలయిం దన్నమాటే!

మన పిల్లలికి ఆంధ్రమందు విముఖతా, అరవమందు దాస్యమూ ప్రారంభం అయ్యే మూలస్థానం ఈస్కూళ్లలోనే అని మన పెద్దలికి తెలియదా? ఇకనైనా మన చెన్నపట్నపు పెద్దలు ఈఅన్యాయం తొలగించడానికి పూనుకుంటారా?

లేకపోతే మనపిల్లలికి వెధవతెనుగు చదువు, ఎందుకని ఊరుకుంటారా?

దీని కేమంటారు? మన మద్రాసు మేయరు శ్రీ వెంకటస్వామినాయుడుగారున్నూ, మద్రాసు కార్పొరేషనులో ఉన్న ఇతరాంధ్ర సభ్యులున్నూ?

---

# ప్రగల్భాలు

కొడవటిగంటి కుటుంబరావు

ఆరోజుల్లో గాంధీమహాత్ముడు ఉప్పుసత్యాగ్రహం ప్రారంభించాడు. లాఠీఛార్జీలతోనూ, అరెస్టులతోనూ, ఉపన్యాసాలతోనూ దేశం ఉడికిపోతున్నది. కుర్రవాళ్లంతా నాయకులైనారు. సరిగా గడ్డాలూ మీసాలూ రానివాళ్లు సయితం వేదికలెక్కి ఉపన్యసిస్తూ, తమ ఉద్రేకాన్నీ, ఉత్సాహాన్నీ ప్రకటిస్తుంటే చూడ ముచ్చటగా ఉండింది.

ఆరోజుల్లో ఆవాలంటీర్ల ఉత్సాహం అంటువ్యాధివలె వ్యాపించిందంటే ఆశ్చర్యంలేదు. ప్రతిరోజూ ఆసభలకు వేలకువేలు జనం వచ్చేవారు. సభ ముగిసేవరకూ ఒక్కరైనా కదిలేవారు కారు. మనంతట మనం పారవశ్యం తెచ్చుకోలేని పక్షంలో మరొకరి పారవశ్యం చూడటమైనా కొంత తృప్తే!

నేనూ శర్మా ఈ సభలకు రోజూ వెళ్లేవాళ్లం; మాకు దేశభక్తి పొర్లిపోయిం దని కాదు, మాకై మేము తెచ్చుకోలేని ఉద్రేకం ఈ విధంగా తెచ్చుకుందామనిన్నీ కాదు—మానవప్రకృతిని గమనించటానికి ఈ సభలద్వారా మాకు మంచి అవకాశం లభించింది.

గాంధీమహాత్ముడు ఉద్రేకం లేకుండా చెప్పిన విషయాలను వాలంటీర్లు ఎంతఉద్రేకంతో ప్రచారం చేశారో మేము గమనించాం. ఉద్రేకం లేకపోతే ఉద్యమమే లేదు. కొందరు కొందరి ఉపన్యాసాలలో హింసాబుద్ధి తాండవం ఆడుతున్నది. వారి ఉపన్యాసాలు జనానికి చాలా ఇంపుగా ఉండినై. అవకాశం లేక అణిగిపడి ఉన్నారే గాని అహింసాతత్వం ఆవాలంటీర్లకు ఏమిఅర్థమవుతుంది?

నిన్నటివరకూ ఆవాలంటీర్లంతా ఎవరిస్వార్థంలో వారుగా ఉండినవారే. దేశాన్ని గురించిగాని, దేశవిపత్తును గురించిగాని, దేశసేవ గురించికాని వారికేమీ పట్టలేదు. దేశసేవకులమని గర్వంగా చెప్పుకునే సాహసం కూడా వారికి ఉండి ఉండదు. దేశసేవ తమవంటి సామాన్యులకు అందుబాటులో ఉన్న విషయమని వారికి తట్టికూడా ఉండదు. కాని ఈనాడు మహాత్ముడి అనుగ్రహం వల్ల దేశసేవ అనేది సుస్పష్టమై చేతులో ఉన్నదిగా పరిణమించింది. ఏముందీ? ఉప్పు చెయ్యటమూ, లాఠీదెబ్బలు తినటమూ, జైలుకు పోవటమూ! ఒంటరిగా చెయ్యవలసివస్తే అదిమటుకు సులభం కాదు. నలుగురితోపాటు నారాయణా. అదీకాక ఎంతకష్టమైనపని అయినా అస్పష్టంగా ఉండకపోయినట్టయితే ఉద్రేకంలో నెత్తిన వేసుకోవచ్చును. ముందూ వెనకా చూసుకున్నవాడు సామాన్యుడు! "భారతదేశం ఎక్కడ? దీనికి దాస్యవిమోచనం కలిగించడం ఎక్కడిపని? అందుకుగాను ఉప్పు వండటం ఏమి కార్యక్రమం? ఒకవేళ గాంధీమహాత్ముడు సరిఅయిన మార్గం తొక్కలేదోమో?—ఈ విధంగా ఆలోచన చేసినవాడు—బుర్ర ఉపయోగించటానికి ప్రయత్నం చేసినవాడు పాపిష్టి!

నేనూ శర్మా పాపిష్టివాళ్లం. మేము స్పష్టంగా తెలుసుకోలేకపోయినాము గాని జరుగుతున్న తంతులో ఏదో వేళాకోళం, వేలంవెర్రి, ఉందని మాకు అస్పష్టంగా తోచింది. స్వతంత్రంగా ఆలోచించాలని మాకు అభిలాష లేకపోయినట్టయితే, ఒకరు చెప్పినదాన్ని మారుమాట లేకుండా విశ్వసించే శక్తి మాకు ఉండినట్టయితే, మేము కూడా ఉద్రేకంలో వాలంటీర్లుగా చేరి అరెస్టు అయి ఇతర వాలంటీర్ల మాదిరిగా మాకూ గాంధీకి జాతిభేదం ఏమీ లేదు, కాస్తలో మేమూ గాంధీలమే అనుకోగలిగే వాళ్లమే నేమో!...

ఒకనాడు సాయంకాలం నేనూ శర్మా సభకు పోతూ ఉండగా దారిలో మాకు నాయుడు తగిలాడు; ఏమిటి కథ, ఎందుకు! ఎక్కడికి, అంత హడావుడిగా పోతున్నారని అడిగాడు. మీటింగుకు వెళుతున్నామని చెప్పాం. కావలిస్తే వాణ్ణికూడా రమ్మన్నాం. నాయుడు బిగ్గరిగా నవ్వాడు. మా దేశభక్తి చాలా పరిహాసాస్పదంగా తోచింది వాడికి. అట్టే దేశభక్తి లేనట్టు నటించటం మాలో కొందరికి చాలా తెలివితో కూడుకున్న పనిగా కనిపించేదని తెలుసుకో

వాలి. వాసుకూడా ఈవిషయంలో మాలో చేరినవాడే. కానీ మాకూ వాడికీ ఉండిన తేడా ఏమంటే, దేశభక్తి ఛాందసమని తేల్చుకుని వాడు దానిజోలికి వెళ్లటం మానేశాడు—మేము పూర్తిగా దేశభక్తికి వైదొలగలేదు.

"నీ నవ్వేకేం లే? అక్కడ ఎంత కళకళగా ఉందో నీకేం తెలుసు? సభామండపం పెళ్లిపందిరి మాదిరిగా ఉంది. చూసి తీరాలిరా, వాసూ!" అని మేమిద్దరమూ వాడికి పురెక్కించాం. చాలాసేపు మాతో రానంటే రానని ఆఖరుకు వాసుగాడు నసపెడుతూ సభకు వచ్చాడు.

ఆనాడు ఆఉపన్యాసాలు వింటున్నంతసేపూ వాసు మనస్సులో ఏ ఆలోచనలు రేకుతున్నదీ మేమెరగం. మాలో కలిగిన అభిప్రాయాలకు భిన్నమైనవి వాడిలో కలుగుతూ ఉండవచ్చునని కూడా మాకు తట్టలేదు. సభ ముగిసి మేమింటికి వచ్చేటప్పుడైనా వాసు మాతో ఏమీ అనలేదు. అప్పుడు వాడి మనస్సు పరాయత్తంగా ఉన్నదని కూడా మేము కనిపెట్టలేక పోయినాం.

మర్నాడు మేము మామూలువేళకు బయలుదేరి దారిలో వాసును కూడా కేక వేశాం. రెండు మూడు కేకలు పెట్టిన తరవాత గర్భవతిగా ఉన్న వాడి భార్య తలుపుతీసి వాసు అంతకు పూర్వమే ఎక్కడికో వెళ్లాడని చెప్పింది.

"మనం మళ్లీ తగులుతామని తప్పించుకున్నాడు—లద్దీకే!" అన్నాడు శర్మ.

వాణ్ణి మరిరెండు తిట్టి మూడారిని మేం సభకు వెళ్ళాం.

మేము చేరేటప్పటికి బ్రహ్మాండమైన సభ జరుగుతున్నది. ఆనాడు పోలీసు రిజర్వు వస్తుందని తెలిసి జనం రెట్టింపుగా వచ్చారు. జనంలో ఉద్రేకం కూడా హెచ్చుగా ఉంది. పొరుగూళ్లనించి రెండువందలమంది కేవలమూ పోలీసుమీద తిరగబడే ఉద్దేశంతో వచ్చినట్టు కూడా చెప్పుకుంటున్నారు. పోలీసుసంఖ్య ఏ రెండు మూడు వందలలో ఉంటేగాని పని జరిగేటట్టు కనిపించలేదు.

నేనూ శర్మా ఆజనంలో చోటు చేసుకుని ఇరికి ఉపన్యాసం వినసాగాం. మాట్లాడవలసినవారు చాలామంది ఉన్నారు. అధ్యక్షుడు అయిదు నిమిషాల కొకరి పేరు చెబుతున్నాడు.

"......వాసుదేవరావుగారు ఉపన్యసిస్తారు", అని అధ్యక్షుడు తెలియజేశాడు.

ఒక్కసారిగా నేనూ శర్మా మొహామొహాలు చూసుకున్నాం. మరుక్షణంలోనే మాసందేహం నివృత్తి అయింది. కొత్త ఖద్దరు బట్టలు కట్టుకుని పెళ్ళికొడుకు అవతారంతో వాసుగాడు ఉపన్యసించటానికి లేస్తున్నాడు!

వాడు పది నిమిషాలు మాత్రమే మాట్లాడాడు. కాని అది అన్నివిధాలా అపూర్వమైన ఉపన్యాసం. మామూలుగా ఇతర ఉపన్యాసకులు తొక్కిన మార్గం తొక్కక వాడు సొంతంగా కొత్తపంథా తొక్కాడు. ఇతరులు ప్రభుత్వాన్ని నిరసించారు. తాము చెయ్యబోతున్న త్యాగాన్ని గురించి ఘనంగా చెప్పుకున్నారు. ఆత్యాగం యొక్క ఆవశ్యకతను గురించి శ్రోతలకు నచ్చచెప్పటానికి ప్రయత్నం చేశారు, కాని వాసుగాడు ప్రభుత్వాన్ని వేళాకోళం చెయ్యసాగాడు. వాడు మాట్లాడుతూంటే జనానికి ప్రభుత్వ మంటే ఉండిన కోపం గాని భయం గాని పోయింది. ప్రభుత్వమంటే వెర్రిముండావ్యవహార మయింది. వాలంటీర్లు చెయ్యవలసింది ఏమాత్రమూ త్యాగం కాదనీ, జైలుకు పోవటమూ దెబ్బలు తినటమూ మొదలైనవి చాలా సరదాతో కూడుకున్న విషయాలనీ వాసు జనాన్ని నమ్మించాడు. అన్నిరోజులూ నేను అటువంటి ఉపన్యాసం వినలేదు. వాడు కూర్చోగానే కరతాళధ్వనులు మారుమోగిపోయినై......

నేనూ శర్మా ఇంటికి వస్తూ వాసుగాణ్ణిగురించి చర్చించాం.

"వాడు ఉపన్యాసా లివ్వటానికి పుట్టాడు వేదిక లెక్కటం రాసిపెట్టి ఉంది. మనం వాణ్ణి బలవంతాన ఇందులో తెచ్చి పడేశాం ఇది రుచి మరిగాడు, ఇక వాడు మన ప్రపంచంలో పడడం దాదాపు అసంభవం", అన్నాను.

"నీమోహమూ, వాడిమోహమునూ!" అన్నాడు శర్మ మొహం చిట్లించుకుంటూ.

"ఇప్పుడేం చేస్తాం? ఇక వాణ్ణి సత్యాగ్రహంలో ప్రవేశించకుండానూ, జైలుకు పోకుండానూ మనం ఆపలేం?"

"ఆపాలి! వాడిమొహం, వాడు జైలుకు పోవటమేమిటి? నిండుచూలాలు ఆపిల్లగతి ఏమిటి? ఆమెకు పుట్టింటివారు ఉండీలేనట్టే. అక్కడ వారికే తిండిఅయినా లేదు. ఆమెకు ఈ వెధవే సమస్తమూనూ. వాడు జైలుకుపోవడానికి వీల్లేదు. ఆపిల్ల గుండెపగిలి చస్తుంది" అన్నాడు శర్మ.

శర్మ వాసుభార్యను పెద్దమనిషి తరహాగా ప్రేమించాడని నేనెరుగుదును. శర్మే కాదు, మేమంతా కూడా ఆ అమ్మాయిని అంత అభిమానంగా చూసేవాళ్లం. ఆమె అంత అమాయకురాలూ, మొగుణ్ణి పంచప్రాణాలుగా చూసుకునేదిన్నీ. నా అనుభవం ఏమంటే ప్రేమించేమనిషిని లోకమంతా ప్రేమిస్తుంది.

"సరే, చూతాం—ఆలోచింతాం!" అన్నాను.

ఆ రాత్రి భోంచేసి నేనూ శర్మా వాసుగాడిదగ్గిరికి వచ్చాం. తొమ్మిదిలగాయతు రాత్రి ఒంటిగంటవరకూ ముగ్గురమూ తర్కించాం. కాని లాభం లేకపోయింది. నేననుకున్నట్టే వ్యవహారం ముదిరిపోయి ఉన్నది. వాసుగాడు సరిఅయిన తర్కానికి రా నిరాకరించాడు. "నేను జైలుకు పోయి తీరతాను. దేశమోక్షానికి అది నాశంతు త్యాగం. త్యాగంచేసేవాడు తన కష్టనష్టాలు లెక్కచూసుకుంటూ కూర్చుంటాడా?... నేను ప్రభుత్వాన్ని గుర్తించను. ప్రభుత్వశాసనాన్ని గుర్తించను. ఉప్పు తయారుచేసి, శాసనోల్లంఘనం ద్వారా నా స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తాను?" ఇదీ వాడిధోరణి.

నాకూ శర్మకూ ఏమీ పాలుపోలేదు. వాసును ఈ కొంటెపని చెయ్యకుండా ఆపటం ఎట్లా ?

“ఆ వెధవకు దేశం ఎటుపోయేది పట్టలే. అసలు దేశమేమిటో వాడికి తెలియదు. వాడికప్పుడు కావలసిందల్లా ఖ్యాతి. జైలుకు పోవటమూ, ఫొటోతో సహా వాణ్ణిగురించి పేపర్లలో పడటమూ, నలుగురూ చెప్పుకోవటమూ—ఇదే వాడికి కావలసింది. సాకుమంటే అందుకని !” అన్నాడు శర్మ.

శర్మగాడు చెప్పింది అక్షరాలా నిజం. నాకై నేను వాసును గురించి దిగులుపడి ఉండనుగాని శర్మగాడి ఆదుర్దా నన్ను నిలవ న్వకపోయింది.

“చూతాంలే—ఏదో చేతాం !” అన్నాను శర్మతో.

మరి రెండురోజులు గడిచినై. ముప్పైమంది మీద ఎరెస్టువారంట్లు పుట్టినవనీ, వారిలో వాసుకూడా ఉన్నాడనీ మాకు తెలిసింది.

“అతను బయటికివచ్చి ఉపన్యాసం ఇవ్వకుండా ఆపిపెట్టండి. నేను వారంటు ఆపిపెట్టగలను !” అన్నాడు పోలీసుడిపార్టుమెంటులో ఉన్న నాబంధువు.

వాసును ఇల్లు కదలనివ్వరాదు—శర్మకోసమే అయినా. ఈపని ఎట్లా సాధించటం ?

అకస్మాత్తుగా తట్టింది ఉపాయం. నేను సంతోషంతో పొంగిపోయినాను. వెంటనే బయలుదేరి శర్మదగ్గిరికివెళ్ళి వాడితో చెప్పేశాను. శర్మ మొదట్లో నా తెలివితేటలకు నిర్ఘాంతపోయి ఆతరవాత నన్ను వీపుపగిలేటట్టు చరిచి, “రైట్, బ్రదర్ ! ఈదెబ్బతో వాసుగాడితల తిరిగి నోట్లోకి రావాలి !” అన్నాడు.

వెంటనే అయిదు నిమిషాలలో మాప్లాను పూర్తిచేసుకున్నాం.

మర్నాడుదయం సూర్యోదయం కాకపూర్వమే నేనూ శర్మా వాసుగాడింటికి పోయినాం. అప్పటికింకా వాడు నిద్ర లేవకపోవటంవల్ల మేమే వాణ్ణి లేపాం.

“ఇంత పొద్దున్నే దాపరించారేం, శనిగ్రహాలు ?” అన్నాడు నాకు. మేము వెనక వాడితో తర్కించినప్పటినించీ వాడు మమ్మల్ని దేశద్రోహులకిందా తనకు విజాతీయులకిందా చూస్తున్నాడు.

“మాకు కొన్ని సందేహాలుండి అడగటానికి వచ్చాం. ఇది చాలా అర్జంటు విషయం” అన్నాను.

“అదివరకు నన్నడిగిన వేనా ?”

“అవును.”

“నేను మీతో ఆవిషయాలిక మాట్లాడను.”

“అట్లాకాదు. తొందరపడకు. మమ్మల్ని మార్పుచేసే బాధ్యత నీ మీద ఉంది. మేమిద్దరమూ వాలంటీర్లు కావచ్చును. ఎవరు చూశారు !”

“నువ్వెంతలో మారిపోయినావో చూడు ?” అని శర్మ అందుకున్నాడు.

“ఏమిటవి మీసందేహాలు ?”

“అసలీ ఉద్యమం దేనికి ?”

“ప్రభుత్వాన్ని ప్రతిఘటించటానికి— శాంతియుతంగా ప్రతిఘటించటానికి ?”

“ప్రభుత్వంతో మనకు పనిలేదన్నమాటేగా ?”

“ఆహా ! నిరభ్యంతరంగా !—అంటే ఇప్పుడున్న ప్రభుత్వంతో మనకు పని లేదు.”

“మరి ప్రభుత్వం మనని ఎరెస్టుచేసి జైలులో పెడితే ?”

“పెడితే పెట్టనీ ! మనం ప్రభుత్వాన్ని గుర్తించం.”

“జైలుకు రమ్మంటే పోతావూ ?”

“బలత్కారం చేస్తే పోతాం. ఇది శాంతి సమరం.”

“ప్రభుత్వం మనల్ని గుర్తించకపోతే ?”

“ప్రభుత్వం లేదన్నమాట. ప్రభుత్వ శాసనమే లేదన్నమాట.”

“అయితే ఈఉద్యమంలోకి అందరూ రానక్కర్లేదన్నమాట. ప్రభుత్వం లేదని కొద్దిమంది నిరూపిస్తే చాలుగా !”

“ఓరి పిచ్చివాడా ! ప్రభుత్వం మనని ఉప్పు చెయ్యనిస్తుందా ? ఎరెస్టుచేసి తీరుతుంది. ఒకరి తరవాత ఒకరు రాకపోతే ఉద్యమం చచ్చిపోతుంది. ఎంతమంది త్యాగం కావాలో ఈఉద్యమం జయప్రదం కావటానికి !”

“అట్లా అయితే మనవంటి అనామకులం కాస్త వెనక ఉండరాదూ ? త్యాగం చెయ్యటానికైనా అందరికీ సమానమైన అర్హత ఉండదుగా ?”

వాసుకు కోపం వచ్చింది. వాణ్ణి అనామకుడనటమూ వాడికి అర్హత లేదనటమూ సహించలేక పోయినాడు.

“అర్హత అంటే ఏమిటి ?”

“నువ్వే ఉన్నావనుకో. నువు ఎరస్టయి దేశానికి చేసే ఉపకారం కంటె నీభార్యకు ఎక్కువ అపకారం చేస్తావనుకో అప్పుడు నీకుం త్యాగం చేసే అర్హత లేదన్నమాట !”

“అర్హత హృదయంలో ఉంది.”

“అయితే త్యాగమూ హృదయంలోనే ఉంటుంది. నువు ఎరెస్టు కావటం మాకిద్దరికీ ఇష్టం లేదురా, వాసూ. నీమీద వారంటున్నది. నువు బయటికి కదిలితే తప్పక ఎరెస్టవుతావు !”

వాసు మొహం ఒక్కసారిగా వికసించింది. “ధన్యుణ్ణి, ధన్యుణ్ణి !” అంటూ వాడు మంచం మీదినించి లేవబోయినాడు.

మే మిద్దరమూ వాణ్ణి బలవంతాన కూర్చోబెట్టి, “ఒరే, వాసూ తొందరపడకు, నీభార్య గర్భిణి. ఆపిల్లకు నువ్వే సమస్తమూ. ఈ సమయంలో నువ్వు దగ్గిర ఉండటం ఆమె మనస్సుకు ఎంతో తృప్తిగా ఉంటుంది”, అని మంచిగా అన్నాను.

వాసు వెధవనవ్వు నవ్వి, “దాని కింకా అయిదారు మాసాలదాకా నాతో పని ఉండదు !” అన్నాడు.

అంతకంటె కూడా ముతకగా మాట్లాడుకోగలం మాలో మేము. అయినప్పటికీ వాడి అకాలహాస్యానికి నారక్తం ఒక్కసారిగా ఉడికిపోయింది. అప్పుడు వాణ్ణిచూస్తే పుట్టిన ఏవగింపు నాకు జన్మలో ఎన్నడూ కలగలేదు. దేశభక్తి ఎవడిలోనైనా అంత నీచత్వం కలిగిస్తుందని నేను పూర్వం ఎరగను.

"ఇంకేమైనా ఉన్నయ్యా సందేహాలు?" అన్నాడు వాసు ఇంకా నవ్వుతూనే.

"లేవు?" అన్నాడు శర్మ పళ్లు బిగబట్టి.

"అయితే వేంచెయ్యండి, నాకు పని ఉంది!" అంటూ వాసు పక్కమీదినించి లేచాడు.

శర్మ వాణ్ణి మళ్లీ పక్కమీద కూలదోసి, "కదలకు. నువ్విగది దాటి పోవటానికి వీల్లేదు. నీకేమైనా కావాలంటే మేము తెచ్చి ఇస్తాం!" అన్నాడు.

వాసు కళ్లెర్రచేసి, "వ్యవహారం ముదురుతున్నదే! నవ్వులకైనా అంతుండాలి!" అన్నాడు.

"ఇది ఎగతాళి కాదు. నిన్ను మే మిద్దరమూ ఎరెస్టు చేశాం!" అన్నాను.

వాసు ఒక్కక్షణం నిర్ఘాంతపోయి మావంక చూసి బిగ్గరగా నవ్వాడు.

"నవ్వనీ! మొదట్లో అట్లాగే అనిపిస్తుంది," అన్నాడు శర్మ నాతో.

వాసు మళ్లీ లేచాడు. శర్మ మళ్లీ వాణ్ణి మంచంమీద తోశాడు. మరుక్షణం వాసు శర్మమీద కలియబడ్డాడు. నేనూ శర్మా కలిసి వాణ్ణి పట్టుకుని మంచంమీద కూర్చోబెట్టగలిగాం.

"నువ్వు సరిగా ప్రవర్తించకపోతే చేతులకూ కాళ్ళకూ బేడీలు వేసి గూట్ళ్ళు విరగ్గొడతాం!" అని నేను వాసుకు తెలియజేశాను.

వాసుగాడికి భయంకరాకారం పడ్డది.

"ముందు మీరిద్దరూ నాఇంట్లోనించి బయటికి పొండి!" అని వాడు బిగ్గరిగా అరిచాడు.

"పిలు! పోలీసుల్ని పిలిచి మమ్మల్ని బయటికి వెళ్ళగొట్టించు!" అన్నాడు శర్మ నవ్వుతూ.

వాసు మొహం పాలిపోయింది. మాట్లాడితే వాడిగొంతు వణికింది.

"మీ ఇద్దరికీ పిచ్చెత్తింది!" అన్నాడు వాడు.

"కాదు. నీకే ఎత్తింది పిచ్చి. నువ్వు ప్రభుత్వాన్ని గుర్తించవు కాని నీ అధికారాలను రక్షించేటందుకు ఏ పోలీసైనా కావాలి! నువ్వు పోలీసును గుర్తించవు కాని వాడే నిన్ను ఎరెస్టుచెయ్యాలి! మేము పనికిరాం! శాంతి సమరమే కాని, అది తుపాకులు చూపించేవాళ్ళమీద! మామీద అయితే తిరగబడతావు! నీ ఇంటినించి మమ్మల్ని వెళ్లగొడతావు కాని దేశంకోసం త్యాగం చెయ్యగలవు!" అన్నాను నేను ఎగతాళిగా.

"అది కాదోయి, పెద్దమ్మా!" అని శర్మ అందుకున్నాడు. "మనం ఎరెస్టు చేస్తే వాడి పేరూ ఫొటో పత్రికల్లో ఎవరు వేస్తారూ? ఎవరు చెప్పుకుంటారూ? వాడికీర్తి దశదిశలా ఎట్లా వ్యాపిస్తుంది!"

వాసు తల వంచుకుని మాట్లాడలేదు.

అయిదు నిమిషాలపాటు ఎవరమూ మాట్లాడలేదు. ఆఖరుకు నేను, "మాకిద్దరికీ కొంత పనిఉంది. వెళ్లి ఒక అరగంటలో వస్తాం. అంతదాకా నువ్వు కదలటానికి వీల్లేదు. మామాటలు ఖైదీవైతే మేము నమ్మి ఉండం కాని నువ్వు నియమానికి బద్ధుడివై ఉండే సత్యాగ్రహివి కనక మేము వెళ్లిన మరుక్షణం తప్పించుకు పారిపోతావని మాకు భయంలేదు!" అన్నాను.

నేనూ శర్మా వాసును వదిలిపెట్టి వచ్చేశాం.

* * * * *

ఆనాడే ౧౮౪౪ సెక్షను అమలులోకి వచ్చింది. అనేకమంది ఉపన్యాసాలిచ్చి ఎరెస్టయినారు. వాసు మాత్రం ఆచాయలకు వెళ్లలేదు.

ఎంతచెడ్డా వాడు మాలోవాడే!

---

# అముద్రితగ్రంథములు—వరదరాజ రామాయణము

శేషాద్రి రమణకవులు

అవతారిక — అముద్రితగ్రంథచింతామణి, సరస్వతి, వైజయంతి ప్రబంధకల్పవల్లరి. చింతామణి లోనగు మాసపత్రికలు అముద్రిత గ్రంథముల సేకరించి ముద్రించి ఆంధ్రవాఙ్మయమునకు సమర్పించి కృతకృత్యము లయ్యెను. ఇపుడాంధ్రసాహిత్యపరిషత్పత్రిక—యథాశక్తితో ప్రాచీనగ్రంథప్రచురణము సాగించుచున్నది. ప్రాచ్యలిఖిత పుస్తకాలయపక్షమునను ఆంధ్రపరిశోధకమండలి పక్షమునను ఆంధ్ర సాహిత్యపరిషత్పక్షమునను లిఖితగ్రంథసంపాదనము విరివిగ జరిగినది. ఈ సంస్థలిపుడు గ్రంథసంపాదనకార్యము నిర్వహించుచున్నట్లు లేదు. తంజావూరు సరస్వతీభాండాగారము, పరవస్తువారి ఆర్ష గ్రంథాలయము, హైదరాబాదు కృష్ణరాయగ్రంథాలయము, రాజమహేంద్రవరము గౌతమీగ్రంథాలయము, హనుమకొండలోని మా పరిశోధకమండలి, ఆంధ్రవిశ్వవిద్యాలయము అముద్రితములు ముద్రితములు నగు లిఖితాంధ్రగ్రంథములతో విలసిల్లుచున్నవి. ఒక తంజావూరు భాండాగారమునకుఁ దక్కఁ దక్కినవానికి అందరకు నందుబాటులో నుండఁదగిన పట్టికలు లేవు. మదరాసు విశ్వవిద్యాలయము వారును, కీర్తిశేషులగు దేశోద్ధారకులును, హైఁదాబారి